నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, సోమవారం 19 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

# తెలంగాణలో.. మళ్లీ వచ్చేది కేసీఆరే..

- ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్సే గెలుస్తుంది
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ మరిచింది
- ఎవరికీ ఉపయోగపడని పథకాలను తెచ్చి ఖజానా ఖాళీ అంటోంది
- ఎవరూ అప్పులివ్వట్లేదంటూ ముఖ్యమంత్రే వ్యాఖ్యానించడం అవివేకం
- అభివృద్ధి, సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసింది
- ఆ అభివృద్ధి ఆనవాళ్లు ఇప్పటికీ కన్పిస్తూనే ఉన్నాయి.. ఎప్పటికీ చెరగవు..
- పెనుబల్లి మండల పర్యటనలో ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్ వ్యాఖ్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్

పెనుబల్లి, మే 18: తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆరేనని ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్ స్పష్టం చేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్సే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలానికి ఆదివారం వచ్చిన ఆయన.. పెనుబల్లిలో తన చిరకాల మిత్రుడైన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోటగిరి సుధాకర్ బాబు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. ఎవరికీ ఉపయోగపడని పథకాలను తెస్తూ ఖజానాలో చిల్లిగవ్వ లేదంటూ బకాయింపు మాటలు చెబుతోందని ఎద్దేవాచేశారు. తమకెవరూ అప్పులివ్వడం లేదంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రే తనస్థాయిని మరిచి మాట్లాడడం అవివేకమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్లనే తమకు నడుస్తలేదంటూ ప్రతిక్షణమూ, ప్రతిరోజూ మాటలు చెబుతుండడం విడ్డూరంగా ఉందని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం.. అభివృద్ధి, సంక్షేమం కోసమే అప్పులు చేసిందని అన్నారు. ఆ అభివృద్ధి ఆనవాళ్లు, ఆ సంక్షేమ పథకాలు ఇప్పటికీ కళ్లముందే కన్పిస్తున్నాయని అన్నారు. అవి ఎప్పటికీ చెరగని ముద్రగా నిలిచిపోతాయని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను చూసి మోసపోయామంటూ తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఏ క్షణమైనా ఎన్నికలొస్తే బీఆర్ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్‌బాబు, తేజావత్ తావునాయక్, ఎస్కే గౌస్, వంగా గిరిజాపతి, చీపు కృష్ణారావు, కొప్పుల రాంబాబు, బజ్జూరి గోపి, జానీ, చీపు శ్రీను, బొర్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. ఆగమాగం

## ధాన్యాన్ని కాపాడుకునేందుకు కర్షకుల కష్టాలు

అశ్వారావుపేట టౌన్, మే 18: అశ్వారావుపేట మండలంలో ఆదివారం కురిసిన వర్షం.. అన్నదాతలను ఆగమాగం చేసింది. ఇప్పటికే కురిసిన వర్షాల వల్ల అన్నదాతలు భారీగా నష్టపోయారు. ఇప్పుడు మళ్లీ వర్షం కురుస్తుండడంతో ఇంకెంత నష్టం వాటిల్లుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఆదివారం నాటి అకాల వర్షానికి పలు గ్రామాల రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. అశ్వారావుపేట, ఉట్లపల్లి, నారాయణపురం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిచిపోకుండా పరదాలు కప్పారు. కానీ కేంద్రాల్లోకి మాత్రం వరదనీరు చేరింది. అయితే, తీసుకొచ్చి 20 రోజులైనా కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని ప్రభుత్వం సరైన సమయానికి కొనుగోలు చేయడం లేదంటూ అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్లనే తమ పంటలు వరద పాలై తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడగండ్లు, అకాల వర్షాలకు మామిడి కాయల్లో ఇప్పటికే పురుగు పడిందని, ధర కూడా చాలా వరకు తగ్గిందని చెబుతున్నారు. అయితే, ఈ నెల 27 నుంచి నైరుతి రుతుపవనాలు కూడా రానున్నట్లు వాతావరణ శాఖ చెబుతుండడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లోని తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ధాన్యపు రాశిపై పరదాలో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

- లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని వంట గ్యాస్ రాయితీ
- ప్రజాపాలన సభల్లో దరఖాస్తులిచ్చినా ఫలితం శూన్యం
- గ్యాస్ కంపెనీల దగ్గర కేవైసీ చేయించినా జమకాని పైకం
- తొలి నాలుగైదు నెలలిచ్చి నిలిపివేసిన ప్రభుత్వం?
- జమ అవుతున్నాయంటూ చెబుతున్న యంత్రాంగం

మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ తమ ఖాతాల్లో జమ కావడం లేదంటూ చెబుతున్న రుద్రంపూర్ తండా మహిళలు



# తుస్సుమన్న గ్యాస్ సబ్సిడీ!

## 'మహాలక్ష్మి'లో రూ.500కే గ్యాస్ సబ్సిడీకి మంగళం?

**ఆరు గ్యారెంటీలంటూ అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. లబ్ధిదారులకు తెలియకుండానే కొన్ని కొన్ని పథకాలకు మంగళం పాడుతోంది. తాజాగా ఈ కోవలోకే మరో హామీ చేరినట్లుగా ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే.. మహాలక్ష్మి పథకంలోని రూ.500కే వంట గ్యాస్ పథకం. 'మేం అధికారంలోకి వస్తే రూ.500కే వంట గ్యాస్' అంటూ కాంగ్రెస్ హామీ ఇవ్వడంతో మహిళలందరూ ఆ పార్టీని ఆదరించి అధికారాన్ని అప్పగించారు. పగ్గాలు చేపట్టిన కొన్నాళ్లకు రూ.500 గ్యాస్ సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తున్నామంటూ విస్తృత ప్రచారం చేసుకుంది. ఆ సమయంలో కొందరి బ్యాంకు ఖాతాల్లో సదరు సబ్సిడీని కూడా జమ చేసింది. దానిని కొద్దిరోజులు కొనసాగించి.. తాము గ్యాస్ సబ్సిడీని నిరాటంకంగా అందిస్తున్నామన్న నమ్మకాన్ని కల్పించింది. తరువాత మెల్లగా సబ్సిడీ నగదును జమ చేయడం తగ్గించింది. మరికొంత కాలానికి మొత్తానికే కాడెత్తేసింది. దీంతో కొన్ని నెలలుగా తమకు గ్యాస్ సబ్సిడీ జమకాకపోవడాన్ని గమనించిన మహిళా మణులు.. బ్యాంకులకు వెళ్లి వాకబు చేయడం మొదలుపెట్టారు. తొలుత నాలుగైదు నెలలపాటు జమ అయిన గ్యాస్ సబ్సిడీ నగదు.. తరువాతి నెలల నుంచి జమ కాకపోవడాన్ని గుర్తించారు. దీంతో.. 'గ్యాస్ సబ్సిడీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుస్సుమనిపించింది' అనుకుంటూ ఉసూరుమంటున్నారు.**

**–భద్రాద్రి కొత్తగూడెం, మే 18 (నమస్తే తెలంగాణ)**

భద్రాద్రి జిల్లాలోని చాలామంది మహిళల బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీ నగదు జమ కావడం లేదు. పథకం ప్రారంభించిన తొలినాళ్లలో నాలుగైదు నెలలపాటు సబ్సిడీ మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జమ చేసింది. దీంతో క్రమం తప్పకుండా తమ ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ అవుతుందున్న నమ్మకంలో లబ్ధిదారులు ఉండిపోయారు. అయితే, ఆ నాలుగైదు నెలల తరువాత గ్యాస్ సబ్సిడీ మొత్తం ఏ నెలకు ఆ నెల క్రమం తప్పకుండా జమ కావడం లేదు. కొన్నిచోట్ల అయితే తొలి నాలుగైదు నెలలు తప్ప ఆ తరువాత ఎప్పుడూ గ్యాస్ సబ్సిడీ బ్యాంకులో జమ కాలేదు. దీంతో అనుమానం వచ్చిన అనేక మంది మహిళలు బ్యాంకుల వద్దకు పరుగులు తీశారు. నెలల తరబడి వాకబు చేశారు. స్టేట్‌మెంట్లు తీసుకొని పరిశీలించుకున్నారు. ఎన్నిసార్లు తిరగేసి చూసినా తొలుత ఇచ్చిన ఆ నాలుగైదు నెలలు తప్ప ఆ తరువాతి నెలల్లో జమ కాలేదనే స్పష్టతకు వచ్చారు. నమ్మక ద్రోహానికి మారుపేరైన కాంగ్రెస్ ప్రభుత్వ నైజంపై మరింత స్పష్టత తెచ్చుకున్నారు.

### పదేపదే దరఖాస్తులిచ్చినా ఫలితం శూన్యం..

అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ఆరు గ్యారెంటీల కోసం ప్రజాపాలన సభలు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. 'రూ.500కే వంట గ్యాస్' అనే సబ్సిడీ పథకానికి అందులోనే దరఖాస్తులు స్వీకరించింది. ఆ ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు తీసుకున్నప్పటికీ చాలామంది ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీ నగదు జమ కాలేదు. దీంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. గ్రామసభల్లోనూ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీశారు. దీంతో గ్యాస్ సబ్సిడీ కోసం అదే గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని, గ్యాస్ కంపెనీల్లో కేవైసీ (మీ వినియోగదారుడి గురించి తెలుసుకోండి)ని పూర్తి చేసుకోవాలని, సబ్సిడీ జమ అయ్యేందుకు వినియోగంలో ఉన్న బ్యాంక్ పాస్ పుస్తకాన్ని అందించాలని సూచనలు చేసింది. దీంతో వినియోగదారులందరూ ఆయా ప్రక్రియలను పూర్తి చేశారు. కానీ.. గ్యాస్ సబ్సిడీ మాత్రం జమ కావడం లేదు. దీంతో ఈ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మెల్లగా ఎగనామం పెట్టిందన్న ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.

### అప్పట్లో ఉరుకులు పరుగులు పెట్టినా..

గ్యాస్ సబ్సిడీ వర్తించాలంటూ గ్యాస్ పుస్తకాలన్నీ మహిళల పేరిటే ఉండాలని, కేవైసీ అప్‌డేట్‌గా ఉండాలని, ఆధార్ కార్డులు – రేషన్ కార్డులు – గ్యాస్ బుక్‌లు అనుసంధానమై ఉండాలని ప్రభుత్వం ప్రకటనలు చేయడంతో, ప్రచారం జరగడంతో ప్రజలందరూ గ్యాస్ కంపెనీల వద్దకు, బ్యాంకుల వద్దకు, మీసేవ కేంద్రాల వద్దకు ఉరుకులు పరుగులు పెట్టారు. రోజుల తరబడి క్యూలలో నిలబడి ఆయా ప్రక్రియలను పూర్తిచేశారు. కానీ.. ఇంత చేసినా గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం వేయకపోవడంపై మహిళలందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 1,47,161 మంది లబ్ధిదారులకు/వినియోగదారులకు గ్యాస్ సబ్సిడీ నగదు జమ అవుతుందంటూ సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అలా లేదని గ్రామాల్లో మహిళలు స్పష్టం చేస్తున్నారు. అసలు ఆ పథకం మొదలైనప్పటి నుంచీ తమకు గ్యాస్ సబ్సిడీయే జమ కావడం లేదంటూ వందలాది మంది మహిళలు బ్యాంకుల వద్ద స్టేట్‌మెంట్లు చూపిస్తూ చెబుతుండడం గమనార్హం. పైగా, ప్రభుత్వం ఇటీవల గ్యాస్ ధరను అమాంతంగా పెంచడంపై భగ్గుమంటున్నారు.

### పథకం పెట్టినప్పటి నుంచీ సబ్సిడీ జమ కాలేదు..



అధికారంలోకి రాగానే రూ.500కే వంట గ్యాస్ ఇస్తామంటూ కాంగ్రెస్ వాళ్లు హామీ ఇచ్చారు. కానీ.. ఇప్పుడు రూ.900 ఇచ్చి గ్యాస్ కొనుక్కోవాల్సి వస్తోంది. అయినా తప్పక కొనుక్కుంటున్నారు. ఈ పథకం పెట్టినప్పటి నుంచి మాకు గ్యాస్ సబ్సిడీ జమ కానేలేదు. కాంగ్రెస్‌ను నమ్మినందుకు మోసం జరిగింది.

**–జెర్రిపోతుల లక్ష్మి, రుద్రంపూర్, చుంచుపల్లి**

### మొదట కొన్ని నెలలే సబ్సిడీ వచ్చింది..



పథకం ప్రారంభించిన కొత్తలో కొన్ని నెలలు మాత్రమే మాకు గ్యాస్ సబ్సిడీ జమ అయింది. గడిచిన నాలుగు నెలలుగా గ్యాస్ తీసుకుంటున్నప్పటికీ సబ్సిడీ నగదు మాత్రం జమ కావడం లేదు. దీంతో పూర్తి డబ్బులు చెల్లించి గ్యాస్ కొనుక్కుంటున్నాం. సబ్సిడీ ఇవ్వని ఈ పథకానికి 'మహాలక్ష్మి' అని పేరెందుకు పెట్టారో ప్రభుత్వం చెప్పాలి?

**–చిదుమల్ల శ్రీదేవి, మేదరబస్తీ, కొత్తగూడెం**

### పైసా కూడా పడలేదు..



ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకంలో భాగమైన గ్యాస్ సబ్సిడీ పథకం మాకు లబ్ధిచేకూర్చలేదు. ఈ పథకం కింద ఇప్పటి వరకూ మాకు పైసా కూడా సబ్సిడీ జమ కాలేదు. చాలాసార్లు బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ చూశాను. నిల్ బ్యాలెన్స్ తప్ప ఏమీ లేవు. మాకేగాదు.. మా తండాలో ఎవరికీ సబ్సిడీ జమ కావట్లేదు.

**–లకావత్ రాధ, లక్ష్మీపురం తండా, చుంచుపల్లి**

### సబ్సిడీ నగదు జమ అవుతోంది..

పథకం ప్రారంభమైనప్పటి నుంచీ గ్యాస్ సబ్సిడీ నగదు ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతూనే ఉంది. కొంతమందికి జమ కావడం లేదని ఇప్పుడే తెలిసింది. కేవైసీ ప్రక్రియ పూర్తికాని వారికి, సాంకేతిక సమస్య ఉన్నవారికి జమ కాలేదేమో. జిల్లాలో 1,47,161 మంది వినియోగదారులు ఇప్పటివరకు 6,31,875 సిలిండర్లను వినియోగించారు. వీరికి రూ.16.56 కోట్లు జమ అయ్యాయి.

**–రుక్మిణి, పౌరసరఫరాల శాఖ అధికారి**

# ఇస్తుందా.. ఇవ్వదా?

## సన్నాల బోనస్‌పై సందిగ్ధం!

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ అన్ని వర్గాల ప్రజలను మభ్యపెడుతున్నది. చివరికి అమలు చేయకుండానే చేతులెత్తేస్తున్నది. కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తున్నది. ఫలితంగా ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలు, రైతులకు నిరాశే మిగులుతోంది. ఇందులో భాగంగానే సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. యాసంగిలో ఏ ఒక్క రైతుకీ జమ చేయలేదు. కేవలం కేంద్రం ప్రకటించిన మద్దతు ధర చెల్లించి తాత్కాలికంగా చేతులు దులుపుకుంది. గత వానకాలం సీజన్‌లో సేకరించిన సన్నాలకు మూడు నెలల తర్వాతనే బోనస్ చెల్లించింది. అది కూడా రైతులందరికీ అందలేదు. ఈ యాసంగిలో విక్రయించిన సన్నాల బోనస్‌ను ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. 'అసలు ఇస్తుందా? లేదా?' అనే సందేహాలు కూడా వెంటాడుతున్నాయి. 'వానకాలం మాదిరిగానే బోనస్ చెల్లింపులో ఆలస్యం అవుతుందా?' లేక 'ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఎత్తేస్తారా?' అనే ఆందోళనలు అన్నదాతల్లో వ్యక్తమవుతున్నాయి. **– అశ్వారావుపేట, మే 18**

- చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న రైతులు
- వానకాలంలో నామమాత్రంగా చెల్లింపులు
- మూడు నెలల తర్వాతనే నగదు జమ
- యాసంగిలో ఇంకా మొదలుకాని చెల్లింపులు
- బోనస్‌పై ప్రభుత్వం నుంచి అందని భరోసా
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆందోళన

పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని, అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నది. అన్ని రకాల పంట ఉత్పత్తులపై బోనస్ ఇస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. తర్వాత సన్నాలకు మాత్రమే వర్తిస్తుందని, దొడ్డు ధాన్యానికి ఇవ్వలేమని చేతులెత్తేశారు. కనీసం సన్నాలకైనా సక్రమంగా బోనస్ చెల్లిస్తున్నారా అంటే అదీలేదు. దొడ్డు రకం ధాన్యాన్ని పక్కనపెట్టి ముందుగా సన్నాలనే ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. కేంద్రం ప్రకటించిన రూ.2,320 మద్దతు ధర కలిపి (క్వింటాకు) బోనస్ రూ.500 చెల్లించాల్సిన ప్రభుత్వం కేవలం మద్దతు ధర మాత్రమే రైతులకు చెల్లిస్తున్నది. సన్నాలకు రూ.500 బోనస్ వస్తుందని ఎక్కువమంది రైతులు సన్నాలనే పండించారు. కొనుగోలు కేంద్రాలకు సన్నాలను తీసుకొచ్చిన తర్వాత కొలతలు సేకరిస్తున్నారు. అనుకున్న దాని ప్రకారం ఉంటేనే సన్నాలుగా నిర్ధారించుకుని అధికారులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడవరకు బాగానే ఉంది. కొనుగోళ్లు పూర్తయిన తర్వాత దొడ్డు రకం ఇచ్చినట్లుగానే సన్నాలకు మద్దతు ధర ప్రకారం క్వింటాకు రూ.2,320 రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. బోనస్ మాత్రం చెల్లించడం లేదు. గత వానకాలంలో కొనుగోలు చేసిన సన్నాలకు బోనస్‌ను మూడు నెలల తర్వాత ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. మరికొందరు రైతులకు అదీ కూడా అందలేదు. ఈ సీజన్‌లోనైనా ప్రభుత్వం తాము పండించిన సన్నాలకు కనీస మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లిస్తుందని రైతులు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదు. సుమారుగా నెలన్నర నుంచి సన్నాలను కొనుగోలు చేస్తున్నది. మద్దతు ధరతోనే బోనస్ వస్తుందని ఆశించిన రైతులు భంగపడుతున్నారు. కేవలం మద్దతు ధరనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో రైతులు అవాక్కవుతున్నారు.

### రూ.కోట్లలో బోనస్ పెండింగ్

భద్రాద్రి జిల్లావ్యాప్తంగా సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను మాత్రమే రైతు ఖాతాల్లో జమ చేస్తున్నది. అదనంగా ఇచ్చే బోనస్ రూ.500ను పెండింగ్‌లో పెడుతున్నది. ఇది కాస్తా రూ.కోట్లలో పేరుకుపోతున్నది. ఒక్క అశ్వారావుపేట నియోజకవర్గంలోనే సుమారు ఇప్పటివరకు 1,66,899 క్వింటాళ్ల సన్నాలను ప్రభుత్వం సేకరించింది. ఇందుకు చెల్లించాల్సిన బోనస్ రూ.8,34,49,500 వరకు పెండింగ్‌లో ఉంది. మరికొంత ధాన్యం సేకరించాల్సి ఉంది. దీంతో కలుపుకుంటే బోనస్ పెండింగ్ మరింత పెరిగిపోతుంది. ఇందులో ఏ ఒక్క రైతు ఖాతాలోనూ సన్నాల బోనస్ జమ కాలేదు.

### స్పష్టత ఏదీ?

సన్నరకం ధాన్యానికి చెల్లించే బోనస్‌పై రైతులు వ్యక్తం చేస్తున్న అనుమానాలకు సైతం అధికారుల నుంచి సరైన సమాధానం రావడం లేదు. బోనస్ చెల్లింపులో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందంటూ తప్పించుకుంటున్నారు. రాష్ట్ర ఖాజానా సరిగా లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే పలుమార్లు ప్రకటించడంతో 'అసలు బోనస్ ఇస్తుందా? లేదా?' అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఏ రోజుకారోజు సేకరించిన సన్నరకం ధాన్యంపై బోనస్ నివేదికలను ప్రభుత్వానికి అందిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. బోనస్ ఎప్పుడు విడుదల చేస్తారన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రావడం లేదు.


కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి రైతులు తెచ్చిన సన్నరకం ధాన్యం





ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న సొసైటీ అధికారులు

### బోనస్ అందలేదు..




ఈ యాసంగిలో సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,320 చొప్పున ఖాతాలో జమ చేసింది. దీనికి బోనస్‌ను కలపలేదు. పెండింగ్‌లో ఉంచింది. గత వానకాలంలో మూడు నెలల తర్వాత బోనస్ చెల్లించింది. ఈ సీజన్‌లో ఆర్థిక పరిస్థితి సరిగా లేదని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. అసలు బోనస్‌ను ఇస్తారా? ఇవ్వరా? అనే స్పష్టత లేదు.

**– చిలుకూరి రాంబాబు, రైతు, అశ్వారావుపేట**

# మాతృభాష పరిరక్షణకు కృషిచేయాలి

- దానిని రాబోయే తరాలకు అందించాలి
- 'కోయ వీరగాథ' ప్రదర్శనలో ఐటీడీఏ పీవో



కోయ సంస్కృతీ సంప్రదాయాల బుక్‌లెట్‌ను గిరిజనులకు అందిస్తున్న భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, మే 18: సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లు అంతరించిపోకుండా కాపాడుకుంటూ వచ్చిన గిరిజనులు.. తమ మాతృభాషను రాబోయే తరాలకు అందించడానికి కృషిచేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ కోరారు. ప్రపంచ ప్రదర్శనశాల దినోత్సవం, కోయ వీరగాథ చక్రం ప్రదర్శన డాక్యుమెంటేషన్ ప్రారంభ సభలో భాగంగా భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమ్మక్క, సారలమ్మ, ఇలవేల్పులు బాపనమ్మ, చంద్రపాల వారసులు, రుద్రమదేవిల చరిత్రను వీరగాథలుగా మలిచి నేటితరం గిరిజనులకు తెలియచేయాలని సూచించారు. నేటితరం గిరిజన యువతీ యువకులకు భాష పట్ల సరిగా అవగాహన లేదని అన్నారు. దీంతో భాషపై మక్కువ కల్పించేలా ఐటీడీఏ ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక దృష్టితో గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేశామని, దానిని అధునాతనంగా తీర్చిదిద్దామని అన్నారు. మ్యూజియం సందర్శనకు వచ్చే టూరిస్టుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. తాను కూడా పీవోగా ఇక్కడ బాధ్యతలు చేపట్టి పది నెలలు గడుస్తున్నాయని, ప్రధానంగా గిరిజన విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించానని అన్నారు. అనంతరం కోయ సంస్కృతీ సంప్రదాయాలకు చెందిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. తరువాత కులపతులను పీవో సత్కరించారు. గిరిజన కల్చర్ రీసెర్చ్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుమలరావు, కులపతులు బండ్ల మునీశ్వరరావు, బాపనయ్య, చుక్కమ్మ, సత్యం, రాంబాబు, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.